

ఎస్సీ స్టడీ సర్కిల్‌ను సందర్శించిన జూపూడి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారులు జూపూడి ప్రభాకర్‌రావు శుక్రవారం తిరుపతి విచ్చేశారు. ఈసందర్భంగా చెన్నారెడ్డి పిఇ కాలనీలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌ను సందర్శించారు. అనంతరం ఆయన గ్రూప్-2 కాంపిటేటివ్ ఎక్సమ్ ప్రిపేర్ అవుతున్న విద్యార్థులకు దాదాపు ఒక గంట సమయం వెచ్చించి స్పేస్‌కి సంబంధించిన మార్క్స్ గురించి రాకెట్ల గురించి, సామాజిక న్యాయం కరెంట్ అఫైర్స్ గురించి, ఏ విధంగా గ్రూప్స్‌కి ప్రిపేర్ అవ్వాలి అనే అంశాలపై వివరించారు. డిప్యూటీ డైరెక్టర్ సోషల్‌వెల్ఫేర్ చెన్నయ్య, ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ జేఏసీ చైర్మన్ ఎలమంచిలి ప్రవీణ్, పాత్రాజు, మల్లారపు మధు, జియో రత్నంరెడ్డి పాల్గొన్నారు.

మా వారు 'నిర్దోషి'



- రుజువుల్లేక ఢీలా పడ్డ జగన్ సర్కార్
- '2024' టీడీపీ- జనసేన కూటమిదే
- 'నిజం గెలవాలి' సభలో నారా భువనేశ్వరి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

మా వారు నిర్దోషి..అక్రమ కేసులో 50 రోజుల్లో జైల్లో పెట్టించిన జగన్ సర్కార్ నేరాన్ని రుజువు చేయలేక ఢీలా పడిందంటూ టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. 2024 ఎన్నికల్లో టిడిపి - జనసేన అఖండ విజయాన్ని సాధించి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయంటూ జోష్యం చెప్పారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో నిర్వహించిన సభలో ఆమె ప్రసంగించారు. ఈ ప్రభుత్వం చంద్రబాబును జైల్లో నిర్బంధించింది..! కానీ ఒక్కటి మాత్రం మరచిపోతున్నారు..! నిర్బంధించింది ఆయన్ను కాదు.. రాష్ట్రాన్ని, న్యాయాన్ని అన్నారు. అందుకే రాష్ట్రం కోసం, మన కోసం, మనబిడ్డల కోసం, భావితరాల కోసం' పోరాడదామని భువనేశ్వరి పిలుపునిచ్చారు. 'నిజం గెలవాలి'.. నిజమే గెలవాలని నినదించారు. ఇక్కడికి రాజకీయాలు మాట్లాడేందుకు రాలేదన్నారు. నిజం గెలవాలని చెప్పేందుకే వచ్చానన్నారు.

ప్రజలే దేవుళ్లన్న ఎన్టీఆర్ స్ఫూర్తితో చంద్రబాబు ఎన్టీఆర్ ట్రస్టు..

నెలకొల్పి ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. చంద్రబాబు గురించి నా కంటే మీకే బాగా తెలుసన్నారు. ఆయన 40 ఏళ్ల రాజకీయ జీవితమంతా ప్రజలు- రాష్ట్ర అభివద్ధి అన్నట్లు సాగిందన్నారు. పద్నాలుగేళ్ల ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని అభివద్ధిపథంలో ముందుకు తీసుకెళ్లారని గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీ పరిశ్రమలు తీసుకొచ్చి, లక్షల మంది యువతకు ఉద్యోగాలు కల్పించి వారి కుటుంబాల్లో సంతోషం నింపిన మహా మనిషి చంద్రబాబు అంటూ కొనియాడారు. విభజిత ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి రాజధానిగా తేవడం, పోలవరం కట్టించడం, రాయలసీమకు కియాపరిశ్రమ తేవడం, నిరుద్యోగులకు స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీలు స్థాపించడం, మహిళలకు పసుపు కుంకుమ ఇవ్వడం, తల్లీబిడ్డ ప్రారంభించడం, పేదలకు మూడు పూటలా పట్టడన్నం పెట్టేందుకు అన్న క్యాంటీన్లు నెలకొల్పడం చంద్రబాబు చేసిన తప్పా అని ప్రశ్నించారు. చంద్రబాబు అంటే అభివద్ధి- అభివద్ధి అంటే చంద్రబాబు అన్న స్థితి నుంచి జగన్ పాలనలో ఏపీ అంటే అవినీతి, ఏపీ అంటే మహిళలపై దాడులు, ప్రశ్నిస్తే కేసులు, పెరిగిన కరెంటు బిల్లులు, నిత్యావసర ధరలు స్థాయికి దిగజారి పోయిందంటూ వాపోయారు. అహర్నిశలు రాష్ట్ర అభివద్ధి కోసం పాటుపడ్డ చంద్రబాబును జైల్లో పెట్టడం చాలా బాధాకరం' అంటూ భువనేశ్వరి భావోద్వేగానిక లోనయ్యారు. జగన్ ప్రభుత్వానికి చంపడం, కేసులు పెట్టి వేధించడమే తప్ప రాష్ట్రాన్ని అభివద్ధి చేయాలని, యువతకు ఉద్యోగాలు తీసుకురావాలనే ఆలోచన లేదని విమర్శించారు. జగన్ సర్కార్ ఎన్ని కుట్రలు చేసినా చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారంటూ కితాబిచ్చారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి జనసేన కూటమి విజయం తథ్యమనీ, వైసిపికి ఓటమి ఖాయమని స్పష్టం చేశారు. మాజీ మంత్రి పనబాక లక్ష్మి, అమర్నాథరెడ్డి, వంగలపూడి అనిత, ఎమ్మెల్సీలు అనురాధ రాంగోపాల్ రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, పులివర్తి నాని, నరసింహ యాదవ్, బొజ్జల సుధీర్ రెడ్డి, ఎస్సీవి నాయుడు, నరసింహ యాదవ్, జనసేన నాయకులు హరి ప్రసాద్, కోట వినుత తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

ప్రాణాలు తీస్తున్న పనిభారం

- సెలవు కావాలంటే డబుల్ డ్యూటీలు
- ఒత్తిడి తాళలేక డ్రైవర్లకు జంట వ్యాధులు
- శ్రీకాళహస్తి ఆర్టీసీలో నిరంకుశ వైఖరి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

మోయలేని పనిభారం.. భరించలేని యాజమాన్యం ఒత్తిళ్లు..వెరసి ఆర్టీసీ డ్రైవర్ల ప్రాణాలను బలిగొంటున్నాయి. ఆర్టీసీ యాజమాన్యం నిరంకుశ వైఖరికి తోడు.. కఠినతర లక్ష్యాలు డ్రైవర్ల పాలిట శాపంగా మారుతున్నాయి. నిత్యం శ్రామికులకు కంటిమీద కునుకును దూరం చేస్తున్నాయి. డ్రైవర్ ఉద్యోగం అంటేనే ఎంతోబాధ్యతతో.. ఒత్తిడితో, క్రమశిక్షణతో, అప్రమత్తతతో కూడుకున్న పని. ఆర్టీసీలో "ప్రయాణం.. సురక్షితం.. సుఖవంతం.. శుభప్రదం" అన్న నినాదంలానే డ్రైవర్లు ప్రయాణికులను సురక్షితంగా వారిరి గమ్యాలకు చేరుస్తున్నారు. ఈ క్రమంలో పనిఒత్తిడిని తట్టుకోలేక వారు గమ్యం చేరేలోపు కానరానిలోకాలకు చేరిపోతున్నారు. ముఖ్యంగా శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోలో యాజమాన్యం తీరు డ్రైవర్లకు ప్రాణ సంకటంగా మారుతోంది. యాజమాన్యం ఒత్తిళ్లకు తాళలేక గడిచిన రెండేళ్ల కాలంలో పదిమంది డ్రైవర్లు గుండెపోటుతో, ఇతరత్రా వ్యాధులతో మృత్యువాతపడ్డారంటే అతిశయోక్తి కాదు. రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో పరిధిలో డ్రైవర్లు యాజమాన్యం వేధింపులకు గురవుతూ ప్రాణాలు కోల్పోతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

సెలవు కావాలంటే డబుల్ డ్యూటీలు

ఆధ్యాత్మిక పట్టణం దృష్ట్యా శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోకి రాష్ట్రంలోనే మంచి గుర్తింపు ఉంది. దశాబ్దం కిందట నష్టాల్లో నడిచినా ప్రస్తుతం లాభాల్లోనే నడుస్తుంది. అయితే మరింత ఆదాయం సమకూర్చడంలో భాగంగా యాజమాన్యం అనుసరిస్తున్న తీరు ఆర్టీసీ ఉద్యోగుల ప్రాణంపైకి తెస్తోంది 'పిండి కొద్దీ రొట్టె' అంటారు పెద్దలు. అయితే పిండే లేకుండా పెద్దఎత్తున ఆదాయం రావాలంటే కుదరదన్న కనీస జ్ఞానాన్ని మరిచి యామాన్యం నిరంకుశంగా వ్యవహరిస్తుండటంతో అసలుకే మోసం వస్తోంది. విలీనానికి ముందు శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో పరిధిలో ఆర్డినరీలు, ఎక్స్‌ప్రెస్‌లు, నాన్‌స్టాప్ (మెట్రో), డీలక్స్ బస్సులను కలుపుకుని 110 సర్వీసులు నడిచేవి. సుమారు 230 మంది డ్రైవర్లు విధులు నిర్వర్తించేవారు. కానీ విలీనం తర్వాత బస్సు సర్వీసుల సంఖ్యను 96కు పరిమితం చేశారు. డ్రైవర్ల సంఖ్య 195కు పడిపోయింది. దీంతో ఉన్న వారితోనే అదనపు పనిగంటలు చేయించుకుంటూ నిర్దేశిత లక్ష్యాలను చేరాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఫలితంగా గతంలో ఉన్న 8గంటల రోజు వారీ పని విధానానికి మంగళం పాడి 16 గంటల పనివిధానానికి శ్రీకారం చుట్టారు. ఆ 16 గంటల్లోనైనా డ్రైవర్, కండెక్టర్ డ్యూటీ దిగుతాడా అంటే అదీ అనుమానంగా మారింది. ఉదాహరణకు శ్రీకాళహస్తి- తిరుపతి మార్గంలో ఓ నాన్ స్టాప్ బస్సు 16 గంటల్లో 6 ట్రిప్పులు తిరగాల్సి ఉంటుంది. అంటే 456 కిలోమీటర్లు తిరగాల్సి ఉంటుంది. అయితే శ్రీకాళహస్తి- తిరుపతి మధ్య ఉన్న ట్రాఫిక్ దృష్ట్యా 5 ట్రిప్పులకే 16 గంటలు ముగిసిపోతోంది. కానీ మిగిలిన ఒక్క ట్రిప్పు, కిలోమీటర్లు కూడా తిరగాల్సిందేనంటూ యాజమాన్యం హుకూం జారీ చేస్తుండటంతో వారి ఆడ్యూటీని పూర్తి చేసుకునేందుకు తెల్లారిపోతోంది. అయితే మరోరోజు వారికి విశ్రాంతినిచ్చినా మరో రోజు సెలవు కావాలంటే డబుల్ డ్యూటీ చేయాలంటూ పేచీ పెడుతున్నారు. దీంతో రెండు రోజుల విశ్రాంతి కోసం డ్రైవర్లు సుమారు 34 గంటలు పనిచేస్తూ ఆరోగ్యాలను పాడు చేసుకుంటున్నారు. సరైన విశ్రాంతి లేక, నిద్ర లేక, తిండి తినక బీపీ, షుగర్ లాంటి జంటవ్యాధుల భారినపడుతూ ప్రాణాలను కోల్పోతున్నారు. సుమారు 70శాతం మంది డ్రైవర్లు బీపీ, షుగర్ వ్యాధులతో బాధపడుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే గడిచిన రెండేళ్ల కాలంలో శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో పరిధిలో సుమారు 10మంది డ్రైవర్లు, ఓ కండెక్టర్ అనారోగ్యం పాలై మరణించడం విచారకరం.





పనిభారంతో మరణించిన ఆర్టీసీ డ్రైవర్లు

ఈ ఏడాది జనవరిలో శేషయ్య, అక్టోబరులో ధన్‌రాజ్ అనే డ్రైవర్లు గుండెపోటుతో మరణించారు. అదేవిధంగా అక్టోబరు నెలలోనే డి.రాంబాబు అనే డ్రైవరు హైబీపీ కారణంగా కిడ్నీ ఫెయిల్ అయ్యి మృత్యువాత పడ్డాడు. రాంబాబు కిడ్నీ వ్యాధితో బాధపడుతూ తనకిచ్చిన 16 గంటల డ్యూటీని పూర్తి చేసుకున్నాడు. తర్వాతి రోజు తనకు విశ్రాంతి. ఆ తర్వాతి రోజు డయాలసిస్ చేసుకునేందుకు లీవు కావాలని కోరితే డబుల్ డ్యూటీ చేయాలంటూ యాజమాన్యం తెగేసి చెప్పింది. ఈ క్రమంలో రాంబాబు డ్యూటీ చేస్తూ ప్రాణాలు కోల్పోవడం విషాదకరం. శ్రీకాళహస్తి- పిచ్చాటూరు మార్గంలో విధులు నిర్వర్తించే డ్రైవర్లు రోజులో 4 ట్రిప్పులు 344 కిలోమీటర్లు బస్సు నడిపితే మరోరోజు వారికి విశ్రాంతి దొరికేది. కానీ ఆ విధానానికి ప్రస్తుత యాజమాన్యం స్వస్తి పలికి ప్రతిరోజూ డ్యూటీ చేయాలంటూ పెత్తనం చేస్తుండటం గమనార్హం. ఈ విధానంపై డ్రైవర్లు మండిపుతున్నా, పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్న యాజమాన్యం గుడ్డిగా ముందుకెళ్లడం చూస్తుంటే వారి నిరంకుశత్వానికి అద్దంపడుతోంది.

ఆదాయాన్ని వదిలేసి..

ఆదాయం కోసం కొత్త మార్గాలను అన్వేషిస్తూ డ్రైవర్లు, కండెక్టర్లపై పనిభారం మోపుతున్న శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో యాజమాన్యం అసలైన ఆదాయమార్గాలను మాత్రం వదిలేస్తోంది. శ్రీకాళహస్తి- నెల్లూరు, శ్రీకాళహస్తి- చెన్నయ్, శ్రీకాళహస్తి- నాయుడుపేట, శ్రీకాళహస్తి- బెంగుళూరు, శ్రీకాళహస్తి- వేలూరు మార్గాలు ఆర్టీసీకి మెరుగైన ఆదాయాలు తెచ్చిపెట్టాయి. అయితే శ్రీకాళహస్తి- నెల్లూరు మార్గంలో నడుస్తున్న 7 సర్వీసులను 3కు, చెన్నయ్ మార్గంలో 8కి బదులు 4కు, బెంగుళూరు మార్గంలో 6కు బదులు 4, వేలూరు(3), నాయుడుపేట(3) మార్గంలో అసలు బస్సు సర్వీసులే లేకుండా రద్దు చేయడంతో ఆర్టీసీకి తీవ్ర నష్టం వస్తోందని డ్రైవర్లు చెబుతున్నారు. శ్రీకాళహస్తి సెక్టార్ పరిధిలో ఉన్న నాయుడుపేట బస్సు సర్వీసులను సూళ్లూరుపేటకు అప్పగించడం చూస్తుంటే ఇక్కడ యాజమాన్యం అవివేకానికి అద్దం పడుతోందంటూ డ్రైవర్లు విమర్శలు గుప్పిస్తున్నారు. డ్రైవర్ల సంఖ్యను తగ్గించడం, సర్వీసులు ఎత్తివేయడంతో శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోకు నష్టం రావడమే కాకుండా ప్రయాణికులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని డ్రైవర్లు వాపోతున్నారు. ఇకనైనా శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో యాజమాన్యం ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లపై పనిభారాలు మోపడం మాని అసలైన ఆదాయ మార్గాలను అన్వేషించాల్సిన అవసరం చాలా ఉందని కోరుతున్నారు.

పనిభారం తగ్గించాలి..

- పెనగడం గురవయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో పరిధిలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్ల చేత అదనపు పనిగంటలు చేయించడం బాధాకరం. ఆర్టీసీ యాజమాన్యం నిరంకుశ వైఖరి మారాలి. యాజమాన్యం ఒత్తిళ్ల కారణంగానే గాంధీ జయంతి నాడు ధనరాజ్ అనే వ్యక్తి గుండెపోటుకు గురై మరణించాడు. రెండు రోజుల కిందట రాంబాబు అనే డ్రైవర్ కిడ్నీ వ్యాధితో మరణించాడు. ఇప్పటికైనా యాజమాన్యం తీరుమార్చుకుని ఉద్యోగులకు అండగా నిలవాలి. లేకుంటే సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతాం.

పనిభారం మోపడం లేదు

రాజవర్ధన్‌రెడ్డి, డీఎం, శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులపై ఎలాంటి పని ఒత్తిడి పెట్టడం లేదు. అదనపు డ్యూటీలు కూడా వేయడం లేదు. 16గంటలు పనిచేసిన వారికి మరోరోజు విశ్రాంతినిస్తున్నాం. ధనరాజు, రాంబాబులు అనారోగ్య సమస్యల వల్లే మృతి చెందారు. అందరికీ సెలవులు ఇస్తున్నాం. వారికిచ్చిన సెలవులకంటే అదనంగా వాడుకుంటున్నారు.

నడకదారిలో మళ్లీ చిరుత, ఎలుగు





కెమెరా ట్రాప్‌లో నమోదైన చిరుత, ఎలుగు బంటి

ప్రజాశక్తి- తిరుమల: తిరుమలకు వెళ్లే అలిపిరి నడక మార్గంలో ఈనెల 24 నుంచి 27వ తేదీ మధ్యలో శ్రీ లక్ష్మీ నారాయణస్వామి ఆలయం నుండి రిపీటర్ మధ్య ప్రాంతంలో ఒక చిరుత, ఒక ఎలుగుబంటి తిరుగుతున్నట్టుగా కెమెరా ట్రాప్‌లో నమోదు అయ్యిందని, కనుక నడకదారి భక్తులు అప్రమత్తంగా ఉండాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. నడకదారిలో ప్రయాణించే భక్తులు గుంపులు గుంపులుగానే వెళ్లాలని సూచించింది.

గద్దర్ స్ఫూర్తి నేటి యువతరానికి అవసరం

సిఐటియు నేత కంగారపు మురళి

పుస్తక ఆవిష్కరణలో ప్రముఖులు



ప్రజాశక్తి - క్యాంపస్ : ఉద్యమాలే ఊపిరిగా తన పాటలతో గానం చేస్తూ యావత్ తెలంగాణతో పాటు తెలుగు ప్రజలందరినీ మేలుకొలిపిన సామాజిక విప్లవ నేత గద్దర్ స్ఫూర్తి నేటి యువతరానికి ఎంతో అవసరం ఉందని సిఐటియు నేత కంగారపు మురళి పేర్కొన్నారు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని సెనేట్ హాల్లో 'గద్దర్ స్ఫూర్తి' పుస్తక ఆవిష్కరణ ప్రజాసంఘాల ఐక్యవేదిక, ఆంధ్రనాడు దినపత్రిక ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి విచ్చేసిన వక్తలు ప్రసంగిస్తూ గద్దర్ ఆలోచనలు, ఆయన సాహిత్యం, పోరాట పటిమ, అన్ని వర్గాలను ఆకట్టుకున్నదని కొనియాడారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన ఎస్వీ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ ప్రిన్సిపల్ ఆచార్య పద్మనాభం మాట్లాడుతూ అణగారిన వర్గాలనుజాగతం చేయడంలో ముందడుగు వేశారని ఆ ముందడుగును ముందుకు తీసుకుపోవాల్సిన ఆవశ్యకత భవిష్యత్ తరాల మీద ఉన్నదని ఆయన అన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి ఉపన్యసిస్తూ పేద బడుగు బలహీన వర్గాల ఆయన పాట ఓ గొంతుక అని, ప్రశ్నించలేని వారి గొంతుక అయ్యారని వ్యాఖ్యానించారు. ఆర్ఎం ఉమామహేశ్వరరావు ప్రసంగిస్తూ సోషల్ మీడియా రాజ్యమేలుతున్న ప్రస్తుత కాలంలో గద్దర్ లాంటి విప్లవాత్మక ఆలోచనలు అవసరమని, ప్రస్తుత సమాజంలో రహస్య విప్లవం జరుగుతోందని అది త్వరలోనే విస్ఫోటం జరుగుతుందన్నారు. ఆ విస్ఫోటనం జరిగినప్పుడే ప్రజల్లో ప్రశ్నించే తత్వం పెరిగి పాలనలో పారదర్శకత పెరుగుతుందన్నారు. గద్దర్ స్ఫూర్తి పుస్తక రచన వ్యయప్రయాసలకు వేసినటువంటి పల్నాటి శ్రీరామ్ కు అభినందనలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ అధ్యక్షులు నూక తోటి బాబురావు ప్రసంగిస్తూ అంబేద్కర్ ఆశయాలను రాజ్యాంగ స్ఫూర్తిని వ్యాప్తింపజేయడంలో గద్దర్ అగ్రగన్యుడని తన ఆట, పాటతో అణగారిన ప్రజానీకానికి గొంతులో నీరు పోసి తట్టి లేపారని కొనియాడారు. గద్దర్ స్ఫూర్తి పుస్తక సంపాదకులు శ్రీరామ్ మాట్లాడుతూ ఇందులో 176 మంది సమకాలిన, ఉద్యమ వాసనలు తెలిసిన వారితో ఆయనకు ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారన్నారు. ఇది ఒక చరిత్ర పుస్తకం కాగలరని ప్రగాఢ విశ్వాసాన్ని వ్యక్తపరిచారు. రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షులు పి.అంజయ్య మాట్లాడుతూ ఈ పుస్తకంలో కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు సామాజిక స్పృహ కలిగిన ఉద్యమ వాసనలు పసిగట్టిన అనేకమంది గద్దర్ గూర్చి రాయడం ఒక చరిత్ర కాగలరన్నారు. ప్రముఖ రచయిత గొడుగు చింత గోవిందయ్య డాక్టర్ వెంకట్ నారాయణ, ఆచార్య శ్యామ్ డేవిడ్, ఆంధ్రనాడు హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

29న వేమన విజ్ఞాన కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తెలుగు ప్రజల ప్రాతఃస్మరణీయుడు సమాజంలోని రుగ్మతలపై అక్షరాన్ని పద్యరూపంలో ఝళిపించిన మహనీయుడు వేమన పేరిట తిరుపతి నగరంలో విజ్ఞాన కేంద్రాన్ని 29వ తేదీ ఆదివారం ప్రారంభించనున్నట్టు వేమన విజ్ఞాన కేంద్రం ట్రస్టు ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున తెలిపారు. యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం మీడియా సమావేశంలో నాగార్జునతో పాటు తిరుపతి బాలోత్సవం అధ్యక్షులు టెంకాయల దామోదరం, నడ్డి నారాయణ, పయ్యావుల గురునాథం, మునిలక్ష్మి, పసల మునిరామయ్య ప్రసంగించారు. వేమన విజ్ఞాన కేంద్రం పేరిట తిరుపతి నగరంలో కరోనా కాలం నుంచి పలు సామాజిక, సేవా, సాంస్కతిక, చైతన్య పూరిత కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 29వ తేదీ వేమన విజ్ఞాన కేంద్రం భవనాన్ని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ప్రముఖ రచయిత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రముఖ పాత్రికేయులు, విశ్లేషకులు తెలకపల్లి రవి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, సమతా స్వాప్నికుడు వేమన పుస్తకాన్ని మాజీ ఎమ్మెల్సీ, విద్యావేత్త విఠపు బాలసుబ్రమణ్యం ఆవిష్కరిస్తారని వారు తెలిపారు. అలాగే ప్రముఖ మార్క్సిస్టు నేత, మదనపల్లికి చెందిన న్యాయవాది దివంగత పలవలి రామకష్ణారెడ్డి పేరిట నిర్మించిన సభా మందిరాన్ని ఆయన కుమార్తె మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య పలవలి కుసుమ కుమారి ప్రారంభిస్తారని, ప్రముఖ అభ్యుదయ అనువాద రచయిత ఏజీ యతిరాజులు పేరిట నిర్మించిన సభా మందిరాన్ని ఏజీ చంద్రమ్మ ప్రారంభిస్తారని తెలిపారు. రాష్ట్రంలో వేమన పేరిట నిర్వహిస్తున్న కార్యక్రమాలలో తిరుపతి జిల్లాలో విజ్ఞాన కేంద్రం నిర్వహిస్తున్న పాత్ర గణనీయమైందని అన్నారు. రాయలసీమ ప్రజానీకం, యావత్ తెలుగు ప్రజలు మహనీయుడు వేమన స్ఫూర్తితో నిర్వహించనున్న వేమన విజ్ఞాన కేంద్రం ప్రారంభ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



వేమన విజ్ఞాన కేంద్రం



ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

పేదలకు కార్పొరేట్ వైద్యం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల ద్వారా ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం అందేలా చూస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. నగరంలోని 48 వార్డు రాజీవ్‌నగర్‌కు సంబంధించి జీవకొనలోని గురుకప స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష క్యాంప్‌ను కమిషనర్ పరిశీలించారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల నిర్వహణ, ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాల పట్ల ప్రజలను అడిగి తెలుసుకుని సంతప్తి వ్యక్తం చేశారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించాలనే సదుద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వంజగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహిస్తున్నదని అన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని అన్నారు. సచివాలయం కార్యదర్శులు, వాలంటీర్లు జగనన్న ఆరోగ్య సురక్ష అప్ డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. మీకు కేటాయించిన గహాలకు వెళ్ళి వైద్య పరీక్షలు నిర్వహించాలని అన్నారు. శుక్రవారం 48వార్డుకు సంబంధించి నిర్వహించిన ఆరోగ్య సురక్ష క్యాంప్‌లో సుమారు 800 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్ రెడ్డి, సూపరింటెండెంట్ రవి, సచివాలయ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

8న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్

రౌండ్ టేబుల్ సమావేశంలో విద్యార్థి, యువజన సంఘాల నేతలు



ప్రజాశక్తి- తిరుపతి టౌన్ : కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని కోరుతూ ఈనెల 8వ తేదీ బంద్ నిర్వహిస్తున్నట్లు విద్యార్థి యువజన సంఘాల నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక బైరాగిపట్టెడలోని జిఎస్‌కె భవన్‌లో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని బండి చలపతి (ఏఐఎస్ఎఫ్) అధ్యక్షతన నిర్వరహించారు. ఈసందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు జయచంద్ర, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కత్తిరవి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాధవ్‌కష్ణ, పిడిఎస్‌యు మహేష్, ఎన్ఎస్‌యుఐ జావిద్, ఆమ్‌ఆద్మీ నగేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పట్ల కేంద్ర ప్రభుత్వం ద్వందవైఖరిని వ్యవహరిస్తుందని, రాష్ట్రంలోని ప్రభుత్వరంగ సంస్థలాన్నిటిని ప్రైవేటీకరణ చేస్తుందన్నారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం 8న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలని విద్యార్థి యువజన నాయకులు పిలుపునిచ్చారు. అనేక త్యాగాలతో విద్యార్థి యువజన నాయకుల 32మంది ప్రాణత్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరణకు పూనుకోవడాన్ని నిరసిస్తూ జరుగుతున్న పోరాటం నవంబర్ 8 నాటికి వెయ్యి రోజులు అవుతున్న సందర్భంగా వామపక్ష విద్యార్థి యువజన సంఘాల ప్రత్యక్ష ఆందోళనలో పాల్గొనడంతో పాటు నవంబర్ 8వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కి పిలుపునిచినట్లు తెలిపారు. లాభాలు వస్తున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలని ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షలాది మందికి ఉపయోగపడుతున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈనెల 31న సీపీఎం కార్యాలయంలో పోస్టర్లు విడుదల, నవంబర్ రెండు, మూడు తేదీల్లో విద్యాసంస్థలకు నోటీసులు అందచేయటం, నవంబర్ 5న ప్రయివేట్ స్కూల్స్ అసోసియేషన్‌తో సమావేశం, 6న టౌన్‌లో బైక్‌ర్యాలీ నిర్వహిస్తామని తెలియచేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సుందర్ రాజు, ఓంరాజ్, హరికష్ణ, సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రవి, అక్బర్, ప్రసన్న, అశోక్, శీను, డివైఎఫ్ఐ నాయకులు సురేష్, అజయ్, ఆమ్‌ఆద్మీ విద్యార్థి విభాగం జగదీష్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు రామకష్ణ, శ్రీను పాల్గొన్నారు.

సాధికారతను అందించిన ఘనత జగన్‌దే..

మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్

యాత్రను ప్రారంభించిన విజయ్ సాయి రెడ్డి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

వైఎస్సార్‌సిపి ఆధ్వర్యంలో తిరుపతి నగరంలో శుక్రవారం నిర్వహించిన సామాజిక సాధికార యాత్రను ఆపార్టీ అనుబంధ సంఘాల సమన్వయకర్త విజయ్‌సాయిరెడ్డి ప్రారంభించారు. నగరంలో అన్ని డివిజన్లో తిరిగిన ఈ యాత్ర గ్రూప్ థియేటర్ సమీపంలో జరిగిన బహిరంగ సభ వద్ద ముగిసింది. సభను ఉద్దేశించి మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ రాజ్యాధికారం ద్వారానే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలకు న్యాయం చేకూరుతుందని భావించి వారికి పదవులు ఇచ్చిన ఘనత జగనన్నదే అన్నారు. ఓదార్పు యాత్రలో భూమన కరుణాకర్‌రెడ్డి కింద పనిచేయడాన్ని మరువలేనని, కరుణన్న ప్రసంగం ప్రజారంజకంగా ఎంతో ఆసక్తిగా ప్రవాహంలా కొనసాగుతుంటుందని అన్నారు. అయితే కరుణాకర్‌రెడ్డిని మరిపించేలా భూమన అభినయ్ ప్రసంగిస్తుంటే ముచ్చటేస్తోందన్నారు. కరుణాకరన్న బిడ్డ అభినయ్‌ను, మీ చేతుల్లో పెడుతున్నారని, ఈసారి జరిగే ఎన్నికల్లో శ్రీ వేంకటేశ్వరస్వామి పాదాల చెంత ఎమ్మెల్యేగా గెలిపించండి అని పిలుపునిచ్చారు. తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ భూమన అభినయ రెడ్డి మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 50శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు కార్పొరేటర్లుగా కేటాయించడం, గెలిపించుకోవడం జరిగిందన్నారు. అన్ని కులాల సమ్మేళనంగా టికెట్లు ఇచ్చి గెలిపించుకున్నామని, మేయర్ పదవిని జనరల్ కేటగిరికి కేటాయిస్తే దాన్ని బీసీ మహిళకు కేటాయించామన్నారు. షాదీ మహల్, జగ్జీవన్ రామ్ భవన్‌ను పూర్తి చేసింది కూడా జగనన్న ప్రభుత్వమే, బీసీలకు స్థానిక చిన్న గంగమ్మ, పెద్ద గంగమ్మ ఆలయాలకు, అలాగే టౌన్ బ్యాంక్ చైర్మన్లుగా నియమించింది వైసీపీ ప్రభుత్వమే అని గుర్తు చేశారు. తిరుమలలో సన్నిధి గొల్ల వివాదం కాకుండా పరిష్కరించిన ఘనత భూమన కరుణాకర రెడ్డిదే అన్నారు. 2019లో భూమన కరుణాకర రెడ్డికి 80వేల ఓట్లు వస్తే, ఈరోజు జగనన్న ప్రభుత్వంలో రెండు లక్షల మందికి పైగా సంక్షేమ పథకాలు అందుతున్నాయి.

తిరుపతి నగరంలో మాస్టర్ ప్లాన్ రోడ్లు, ఫ్రీ లెఫ్ట్ లు నిర్మించామని, దీంతో ఆటోలు తిరగడమే కష్టమైన నగర రోడ్ల మీద డబుల్ డెక్కర్ బస్సు తిరిగే పరిస్థితి ఏర్పడిందన్నారు. వినాయక సాగర్ విస్తరణ కూడా మన ప్రభుత్వమే నిర్వహించిందన్నారు. శెట్టిపల్లిలో త్వరలో ఐటీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సెక్షన్ 22ఏ కింద యాభై ఏళ్లుగా తిరుపతి ప్రజల ఎదుర్కొంటున్న 7వేల మందికి ఇళ్ల స్థలాల హక్కులకు భద్రత కల్పించామని, ప్రజా సంక్షేమాన్నికి కషి చేస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్, మేయర్ డాక్టర్ శిరీష, కార్పొరేటర్లు వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న భూమన

గ్రామస్తుల సమస్యలు పట్టించుకోని తహశీల్దారు మాకొద్దు..!

కలెక్టరుకు రామరాజు కండ్రిగ ప్రజల వినతి


నిరసన తెలుపుతున్న బాధిత ప్రజలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: గ్రామ ప్రజల సమస్యలు పట్టించుకోని తహశీల్దారు తమకు వద్దని వడమాలపేట మండలం లోని రామరాజు కండ్రిగ మాదిగ పల్లి గ్రామ ప్రజలు కలెక్టరుకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వారు రామరాజు కండ్రిగ మాదిగ పల్లిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల తహశీల్దారుకు తాము ఆరు నెలలుగా తమ గ్రామ శ్మశాన వాటిక కు దారి సమస్యను గ్రామకంఠం సర్వే నిర్వహించి సరిహద్దులు తెలపాలని ఆరు నెలలుగా ఎస్సీ ,ఎస్టీ మానిటరింగ్ కమిటీ, సివిల్ రైట్ మీటింగ్‌లలో అనేకసార్లు అర్జీలు ఇచ్చామన్నారు. కానీ తహశీల్దారు నుండి ఎలాంటి స్పందన లేదన్నారు. 'గ్రామ ప్రజల సమస్య పరిష్కరించలేని తహశీల్దారు మాకొద్దు...!' అని తిరుపతి కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో అర్జీలు సమర్పించామని, దళితులపైన నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తూ తమ సమస్యలు పరిష్కరించలేదని ఈ సమస్యపై తమ ఇరు గ్రామాల ప్రజలు తహశీల్దారు కార్యాలయంలో వారు దళితులైన తమపై కేసులు పెట్టారని, దళితవాడలలో తాము లేని సమయంలో అగ్రకులాల నాయకులు మహిళలను నానా దుర్భాషలాడుతూ కులం పేరుతో దూషిస్తూ ' మీకు ఇక్కడ స్థలం ఎక్కడ లేదు..?' అంటున్నారన్నారు. మండల తహశీల్దారుపై నమ్మకం లేదని, కలెక్టర్ డిస్ట్రిక్ సర్వేయర్‌ని పిలిపించి తమ శ్మశాన వాటికకు దారి, గ్రామకంఠ సర్వే నిర్వహించి సరిహద్దులు చూపి, గృహాలు లేని వారికి గృహాలు నిర్మించుకోవడానికి గ్రామ కంఠాన్ని తమకు కేటాయించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రామరాజు కండ్రిగమాదిగ పల్లె గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యలు ఎక్కడికక్కడే పరిష్కరించాలి: ఎస్పి


పాకాల పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్‌పి

ప్రజాశక్తి -పాకాల: సమస్యలు ఎక్కడికక్కడే పరిష్కరించి సమస్యలు లేకుండా చూడాలని ఎస్పి పరమేశ్వర్ రెడ్డి పోలీసులను ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలకు ప్రజలు దూరంగా వుండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పాకాల పోలీస్ స్టేషన్ ను ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజిబుల్ పోలీసింగ్ వల్ల నేరాలకు అడ్డు కట్ట వేయవచ్చన్నారు. గ్రామాల్లో నిరంతరం పర్యటించి గ్రూపు తగాదాలు లేకుండా చూడాలని, సమస్యలు ఎదురైతే అవకాశం ఉన్న వాటిని ఎక్కడికక్కడే పరిష్కరించాలి అన్నారు. ఫిర్యాదు దారులకు, బాధితులకు ఎల్లప్పుడూ పోలీస్ స్టేషన్ అండగా నిలవాలి. క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి, ఫిర్యాదు దారులతో ఆత్మీయంగా, హుందాగా మాట్లాడి సమస్యలను పరిష్కరించాలన్నారు. హైవే రహదారుల పై నిరంతర నిఘా ఉంచి వాహనదారులకు ప్రమాదరహితంగా ఉండాలన్నారు. పాకాల పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసి ఎస్‌హెచ్ఓ, సిబ్బంది పనితీరును సమీక్షించి జనరల్ డైరీ, కేసు డైరీ, కోర్టు క్యాలెండర్ వంటి పలు రికార్డులను తనిఖీ చేసి పరిశీలించారు. పెండింగ్ కేసులు సకాలంలో దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు సరైన న్యాయం చేయాలన్నారు. సైబర్ నేరాల పట్ల సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి త్వరిత గతిన పూర్తి చేయాలని, మహిళా సంబంధిత నేరాల పట్ల వెంటనే స్పందించి న్యాయం చేయాలన్నారు. పాకాల జంక్షన్ రైల్వే స్టేషన్, ఉట్ల వారి పల్లె శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం పరిసర ప్రాంతాల నుండి హైవే రహదారుల వరకు నిరంతరం గస్తీ కాసేందుకు బ్లూ కోల్ట్స్,బీట్ సిస్టంను బలోపేతం చేసి,మరింత సమర్థవంతంగా పనిచేసి నేర నివారణ చేయాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలోని మహిళా సంరక్షణ కార్యదర్శుల పనితీరును సమీక్షించి వారితో మాట్లాడుతూ నేటి సమాజంలో గృహ నిర్బంధ మహిళా సంబంధిత విషయాలను,బాలికలు ఎదుర్కొంటున్న ఈవ్ టీజింగ్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ మరియు పోక్సో చట్టం వంటి విషయాల గురించి సంబంధిత విద్యా సంస్థలు,పారిశ్రామిక ప్రాంతాల యందు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి చైతన్యవంతులను చేసి, కళాశాల,పాఠశాలల్లో బాలికల పట్ల ఉపాధ్యాయులు అసభ్య ప్రవర్తన గురించి విద్యార్థులతో మాట్లాడి తెలుసుకొని ఏదైనా అనుకోని సంఘటనలు జరిగి ఉంటే తమ ఎస్‌హెచ్‌ఓకి తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి డిఎస్పీ యశ్వంత్, సిఐ లు చంద్రశేఖర్ పిళ్లై డిసిఆర్‌బి, ఓబులేష్ పాకాల, ఎస్‌ఐలు, పాకాల పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో ముసాయిదా ఓటర్ల జాబితా మేరకు 17,61,328 మంది ఓటర్లు: కలెక్టర్



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ప్రత్యేక ఓటర్ల సంక్షిప్త సవరణ -2024 నేడు ప్రచురించబడిన ముసాయిదా ఓటర్ల జాబితా మేరకు తిరుపతి జిల్లాలో 17,61,328 మంది ఓటర్లు వున్నారని కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో కలెక్టర్ అధ్యక్షతన రాజకీయపార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముసాయిదా ఓటర్ల జాబితా మేరకు ప్రత్యేక ఓటర్ల సంక్షిప్త సవరణ 2024 మేరకు ఇప్పటికే 11సార్లు రాజకీయపార్టీల ప్రతినిధుల సమావేశాలు నిర్వహించి ప్రక్రియ వివరించామని, నేడు ముసాయిదా ప్రకటన జరుపుతున్నామని తెలిపారు. ప్రత్యేక ఓటర్ల సంక్షిప్త సవరణ -2024 మేరకు పూర్తిస్థాయిలో ఓటర్ల జాబితా 2024 జనవరి 5న ప్రకటిస్తామని నేటి నుంచి దరఖాస్తులు స్వీకరణ, ఆఫ్‌లైన్ నెట్ క్లోజ్ అయ్యే సమయానికి వున్న పెండింగ్ దరఖాస్తులు పూర్తి స్థాయిలో పరిశీలించి అప్‌లోడ్ చేస్తామని వివరించారు. ప్రత్యేకించి నవంబర్ 4,5 , డిసెంబర్ 2,3 తేదీల్లో ప్రతి పోలింగ్ కేంద్రంలో బిఎల్‌ఓలు ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాకు అందిన ఓటింగ్ యంత్రాల ఎఫ్‌ఎల్‌సి ప్రక్రియ నవంబర్ 10 వరకు జరుగుతుందని రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పక హాజరై సందేహాలు నివృత్తి చేసుకోవాలని సూచించారు. రెగ్యులర్‌గా హాజరవుతున్న ప్రతినిధులు ఎఫ్‌ఎల్‌సి ప్రక్రియను సమావేశంలో వివరిస్తూ కలెక్టర్ చేపట్టిన ఏర్పాట్లు, పరిశీలకులు వచ్చిన ప్రత్యేక ఎన్నికల అధికారులు ప్రచురించిన విధానం వివరించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ పెంచల కిషోర్, ఆర్‌డిఓలు తిరుపతి నిశాంత్ రెడ్డి, శ్రీకాళహస్తి రవిశంకర్ రెడ్డి, సూళ్లూరుపేట చంద్రముని, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, ఎన్నికల సూపరింటెండెంట్ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆమ్‌ఆద్మీ నరేష్, బిజెపి వరప్రసాద్, టిడిపి మనోహరాచారి, కాంగ్రెస్ చిరంజీవి, వైసిపి చంద్రమోహన్, తహశీల్దార్లు, ఐడిటీలు పాల్గొన్నారు.

రక్తదానం సామాజిక బాధ్యత: డిఎస్‌పి


మాట్లాడుతున్న డిఎస్‌పి సూర్యనారాయణరెడ్డి

ప్రజాశక్తి - గూడూరు రూరల్: రక్తదానం చేయడం వల్ల ప్రమాదాల్లో గాయ పడిన వారికి రక్తదాన శిబిరాల ద్వారా సేకరించిన రక్తం ద్వారా ప్రాణా లు కాపాడవచ్చని దీనివల్ల రక్తదానం చేసిన వారికి కూడా నూతన రక్తం ఉత్పత్తి అవుతుందని గూడూరు డిఎస్పీ సూర్య నారాయణ రెడ్డి పేర్కొన్నారు. గూడూరు పట్టణ సమీపం లోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో పోలీస్ అమరవీరుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరం నిర్వ హించారు. పోలీసులు, యువతీ యువకులు , రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిఎస్పీ సూర్యనారాయణ రెడ్డి దాతలను అభినందించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ అనేక రోడ్డు ప్రమాదాలు, ప్రసవ సమయంలో రక్తం లేక ఎంతోమంది చనిపోతున్నారని, రక్తదానం చేయడం వల్ల ఎంతో మంది ప్రాణాలు నిలపవచ్చని తెలిపారు. విద్యార్థులు వారి కళ్ల ఎదుట జరుగుతున్న నేరాలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐలు దశరథ రామారావు, హజరత్ బాబు , వెంకటేశ్వరరావు , ఎస్ఐ అంజిరెడ్డి, కళాశాల ఏవో రమయ్య డాక్టర్లు పాల్గొన్నారు.

నారాయణలో ర్యాగింగ్ నిరోధంపై అవగాహన

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో ర్యాగింగ్ నిరోధంపై శుక్రవారం అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఒకటవ పట్టణ ఎస్ఐ పవన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులనుద్దేశించి ఎవరైనా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ర్యాగింగ్ కు పాల్పడినా, పాల్గొన్నా, ప్రోత్సహించినా ప్రభుత్వం చేసిన నిషేధ చట్టం ప్రకారం కఠిన శిక్షలు తప్పవన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే రెండు సంవత్సరాల వరకు జైలు శిక్ష లేదా పది వేల రూపాయల వరకు జరిమానా ఉంటుందన్నారు. తోటి విద్యార్థులతో సోదర భావంతో మెలగాలన్నారు. ర్యాగింగ్ కు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రవి ప్రసాద్ , వైస్ ప్రిన్సిపాల్ విశ్వనాథ రెడ్డి , కళాశాల యాంటీ ర్యాగింగ్ సెల్ కన్వీనర్ కృష్ణయ్య , ఏఓ కొండా రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన ఈ క్రాప్ బుకింగ్

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: మండలంలోని 12 పంచాయతీల్లో రైతులకు ఖరీఫ్ 2023 సీజన్లో 3,288 మంది రైతులకు 9,451 ఎకరాలలో పంట సాగుకు ఈక్రాప్ బుకింగ్ పూర్తి చేశామని మండల వ్యవసాయ అధికారి భాదర్ బాషా శుక్రవారం తెలిపారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద అక్టోబర్ 26 నుండి 29 వరకు ఈ క్రాప్ ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీ కోసం బహిరంగ ప్రదర్శన నిర్వహిస్తామని ఏవో తెలిపారు. రైతులకు అభ్యంతరాలు ఉంటే అధికారులకు తెలుపవచ్చని పేర్కొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని 28పంచాయతీల్లోని రైతులకు ఖరీఫ్ 2023 సీజన్లో 3288 మంది రైతులకు 9451 ఎకరాలలో పంట సాగుకు ఈక్రాప్ బుకింగ్ పూర్తి చేశామని మండల వ్యవసాయ అధికారి వ్యవసాయ అధికారి భారతి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద అక్టోబర్ 26 నుండి 29 వరకు ఈ క్రాప్ ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీకి బహిరంగంగా ప్రదర్శ నిర్వహిస్తామని ఏవో తెలిపారు. రైతులు అభ్యంతరాలు ఉంటే అధికారులకు తెలుపవచ్చని పేర్కొన్నారు.

ఎంపిడిఓ కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి -కోట : కోట మండలంలో శ్రీ లక్ష్మమ్మ గిరిజన కాలనీలో నూతనంగా నిర్మించిన సమాజ వికాస భవనంపై పలు రకాలుగా కొద్ది రోజులు నుండి వివాదాస్పదంగా ఆరోపణలు తలెత్తడం అందరకి తెలిసిన విషయమే. ఈ సందర్భంగా ఈ వివాదంపై జిల్లా గిరిజన నాయకులు, స్థానిక కాలనీ వాసులు కలిసి మూకుమ్మడిగా ఎంపిడిఓ కార్యాలయంను శుక్రవారం ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయా గిరిజన నాయకులు నూతనంగా నిర్మించిన భవనాన్ని గిరిజన కుటుంబాల కోసం కేటాయించాలని, భవనానికి వేసిన తాళంను అప్పగించాలని వారు కాసేపు ఎంపిడిఓ భవాని ముందు ఆందోళన చేపట్టారు. స్పందించిన ఎంపిడిఓ గూడూరు ఆర్డీఓ ఆదేశాల మేరకే వారికి అప్పగించామని లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. అనంతరం స్థానిక ఎంపిపి కార్యాలయానికి వెళ్లి ఎంపిపి దాసరి.అంజమ్మ, జడ్పిటిసి దాసరి కోటయ్యను గిరిజనులు ఈ విషయంపై పలు రకాలుగా ప్రశ్నించగా సానుకూలంగా స్పందించి జరిగిన సంఘటన గురించి పై స్థాయి అధికారులకు తెలిపారు. ప్రస్తుతం విచారణ జరుగుతోందని త్వరలోనే సరైన నిర్ణయాలు తీసుకుంటామని గిరిజనులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు గిరిజన నాయకులు బిఎల్ శేఖర్, మాకాని వెంకటేశ్వర్లు, విసికే పార్టీ నాయకులు ఆర్వీ రమణయ్య, చౌటూరి.శీనయ్య,కోట సర్పంచ్ ఇండ్ల వెంకటరమణమ్మ,మాజీ సర్పంచ్ తిరుమలశెట్టి ప్రసాద్,మహిళా కన్వీనర్ లు మేకల సులోచన, చౌటూరి శ్యామల పాల్గొన్నారు.

15 న చలో విజయవాడను జయప్రదం చేయండి

- సిఐటియు ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు బివి రమణయ్య


మాట్లాడుతున్న సిఐటియు ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బివిరమణయ్య

ప్రజాశక్తి - గూడూరు టౌన్: నవంబరు15వతేదీ నిర్వహించనున్న చలో విజయవాడను జయప్రదం చేయాలని సిఐటియు ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు బివిరమణయ్య పిలుపు నిచ్చారు. గూడూరు పట్టణం లోని సిఐటియు కార్యాలయంలో తిరుపతి జిల్లా ఆటో వర్కర్స్ అండ్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యుల సమావేశం శుక్రవారం నిర్వహిం చారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు బివి రమణయ్య మాట్లా డుతూ భవిష్యత్ కర్తవ్యాలు , సభ్యత్వాల పెంపుపట్ల కృషి చేయా లన్నారు. నవంబర్ 15వ తేదీ చలో విజయవాడను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు కె లక్ష్మయ్య, వై కుమార్, కమిటీ సభ్యులు బి రమేష్, కె రమణయ్య, కె చంద్ర, డి వెంకటరమణ, ఐ వినోద్ పాల్గొన్నారు.

మైనింగ్ మాఫియాకు అధికారులు, పోలీసుల రక్షణ

- టిడిపి నాయకుల ఆరోపణ
- మైనింగ్ మైన్స్ పరిశీలనకు పిలుపు
- మాజీ ఎమ్మెల్యే పాశం హౌస్ అరెస్ట్


మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌ను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : వైసిపి నాయకుల ఒత్తిడికి పోలీస్ శాఖ అధికారులు ఎస్సీ, ఎస్టీలపై ఎస్సీ ఎట్రాసిటీ కేసులు నమోదు చేసి న్యాయ స్థానాల్లో అభాసుపాలు అవుతూ, వైసిపి నాయకుల అక్రమ మైనింగ్ కు సహకరిస్తూ మైనింగ్ శాఖ అధికారులు పనిచేస్తుంటే అక్రమ మైనింగ్‌కు పోలీస్ శాఖ రక్షణ కల్పిస్తోందని గూడూరు మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ తీవ్రంగా ఆరోపించారు. సైదాపురం మండలంలో జరుగుతున్న అక్రమ మైనింగ్ మైన్స్ పరిశీలనకు టిడిపి నెల్లూరు జిల్లా కమిటీ పిలుపు ఇవ్వడంతో ముందస్తు చర్యల్లో భాగంగా శుక్రవారం గూడూరు పట్టణంలోని గూడూరు మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ నివాసంలో ఆయనను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. గూడూరు మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ హౌస్ అరెస్టును నిరసిస్తూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గం లో అత్యంత విలువైన ఖనిజ సంపద ఉందని తెలిపారు. వైసీపీ నాయకులు అక్రమ మైనింగ్ ద్వారా వేలాది కోట్ల రూపాయలు విలువచేసే కనిజ సంపదను బహిరంగంగా దోచు కుంటుంటే మైనింగ్ శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. పోలీస్ శాఖ అధికారులు కూడా కళ్ల ముందే వందలాది లారీల్లో ఖనిజాలు తరలి వెళుతుంటే చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. సైదాపురం మండలంలో జరుగుతున్న అక్రమ మైనింగ్ గ్రామ ప్రజలకు తెలపాలన్న ఉద్దేశంతో అక్రమ మైన్సను పరిశీలించేందుకు టిడిపి నాయకులు వెళుతుంటే హౌస్ అరెస్టులు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. సైదాపురంలో జరుగుతున్న మైనింగ్ పై విచారణ కమిటీ వేసి నిజాలను వెలికి తీయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కనీసం వివాహాలకు వెళ్లి వధూవరులను ఆశీర్వదించే అవకాశం కూడా ఇవ్వకుండా పోలీసులు నిర్బంధించడం హేయమైన చర్య అని ఆయన అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు భాస్కర్ రెడ్డి, వెంకటేశ్వరరాజు, చెంచురామయ్య, ఇజ్రాయిల్ కుమార్, రవీందర్ రెడ్డి,రహీం ,పెంచలయ్య పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదుపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని రైతు భరోసా కేంద్రాలలో లో ఖరీఫ్ 2023 పంట సాగు చేసుకొని ఈ క్రాప్ నందు నమోదు చేసుకున్న రైతుల వివరములు శుక్రవారం గ్రామసభ,సామూహిక తనిఖీ కోసం ముసాయిదా జాబితా వివరాలను రైతు భరోసా కేంద్రంలో ప్రదర్శించారు. తగు జాబితాలో సందేశాలు, తప్పులు ఉంటే మార్పులకు ఈ నెల 29తేదీ వరకు సమయం వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట ఏడిఏ టి.ఉమ, మండల వ్యవసాయ అధికారి వి.నిరంజన్ కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు సాయి, వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ బ్రిడి కోసం పరిశీలన

వెంకటగిరి- ప్రజాశక్తి : తిరుపతి జిల్లా వెంకటగిరి పట్టణంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ లకు అనుమతుల వరకు 365 నేషనల్ హైవే ఆదేశాలతో ఆర్ అండ్ బి అధికారులు మున్సిపాలిటీ కమిషనర్ వెంకటరామయ్య ఆధ్వర్యంలో శుక్రవారం పరిశీలించారు. 365 నేషనల్ హైవే రాపూరు తిరుపతి వెంకటగిరి రాపూర్ క్రాస్ రోడ్ నుండి తిరుపతికి వెళుతున్న ఒక కిలోమీటరు ఫ్లై ఓవర్ బ్రిడ్జి, రైల్వే స్టేషన్ గేటు ప్రజలకు ఇబ్బందుల వల్ల ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ఎస్టిమేషన్లు పంపాలని ప్రభుత్వం కోరడంతో రోడ్లు భవనాల శాఖ అధికారులు మున్సిపల్ సిబ్బంది ఎస్టిమేషన్లు పంప డానికి ఆయా జంక్షన్ లలో పర్యవేక్షించి పరిశీలించారు.

టిడ్కో ఇళ్ల అర్హత పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - వెంకటగిరి : తిరుపతి జిల్లా వెంకటగిరి పట్టణంలోని జగనన్న సొంతింటి కల పేదవానికి వరం అంటూ టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అన్ని సౌకర్యాలతో పంపిణీ చేయడానికి ఆంధ్రప్రదేశ్ టిడ్కో హౌసింగ్ ఎస్సీ జాన్సన్ శుక్రవారం పరిశీలించారు. శనివారం 11 గంటలకు వెంకటగిరి మున్సిపాలిటీ కార్యాలయంలో 192 మంది లబ్ధిదారులకు అర్హత పత్రాలను అందజేస్తున్న సందర్భంగా రాష్ట్ర స్థాయి అధికారి పరివేక్షించి వాటర్ ట్యాంక్ ను రోడ్డుల, డ్రైనేజీలను, విద్యుత్ సౌకర్యాలను పరిశీలించారు. ఈ పర్యవేక్షణలో మున్సిపల్ మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య, టిడ్కో హౌసింగ్ చీఫ్ ఇంజనీర్ మరియన్న, డి ఈ రంగయ్య, ఏ ఈ కోటేశ్వరరావు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

రూరల్ ఎస్ఐగా సుధాకర్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్ : తిరుపతి జిల్లా వెంకటగిరి పట్టణంలో అదనపు ఎస్ఐగా సుధాకర్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో బాలాయపల్లి , ఒంగోలులో విధులు నిర్వహించి నట్లు తెలిపారు. ప్రజలకు శాంతి భద్రతల దృష్ట్యా చట్ట వ్యతిరేక చర్య లకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పు అని అన్నారు. యువత మద్యానికి, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని యువతీ యువకులకు సూచించారు.

సౌత్ జోన్ వైస్ ఛాన్సలర్‌ల సమావేశంలో మహిళా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డి భారతి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి. భారతికి అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ నిర్వహించిన సౌత్ జోన్ వైస్ ఛాన్సలర్ సమావేశం 2023-24 కి ఆహ్వానం అందింది. ఈ కార్యక్రమాన్ని అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్, విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ యూనివర్సిటీ బెలగావి సంయుక్తంగా నిర్వహించారు. 26,27 అక్టోబర్ 2023 బెలగావిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చీఫ్ గెస్ట్ గా డాక్టర్ ఎంసి సుధాకర్ ఎడ్యుకేషన్ మినిస్టర్, గవర్నమెంట్ ఆఫ్ కర్ణాటక హాజరయ్యారు. ముగింపు సభకు కర్ణాటక గవర్నరు తవర్ చాంద్ గెహ్లాట్ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి సౌత్ ఇండియా నుండి 50 మందికి పైగా వైస్ ఛాన్సలర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డి భారతి వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ ఉన్నత విద్యలో డిజిటల్ పరివర్తన అనే అంశంపై చర్చించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అనలిటిక్స్ ఇన్ హైయర్ ఎడ్యుకేషన్, ఫ్యాకల్టీ, డిపార్ట్మెంట్ డిజిటల్ పెడగాగి, ది ఫ్యూచర్ ఆఫ్ క్రెడిన్షియలింగ్, డిజిటల్ బ్యాచ్ ఎస్, ఆన్లైన్ డిగ్రీస్ వంటి అంశాలపై చర్చలు నిర్వహించారు.

హిమజా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ర్యాలీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: హిమజా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లోకనాథరెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని 'నేల తల్లికి నమస్కారం.. వీరులకు వందనం..' అంటూ విద్యార్థులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. సమావేశ మందిరంలో అమరవీర విద్యాసంస్థల ఎన్ఎస్ఎస్, నెహ్రూ యువ కేంద్రం సహకారంతో నారాయణనం యూత్ అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని అధ్యక్షులు మునిక్రిష్ణయ్య నెహ్రూ యువ కేంద్రం తిరుపతి జిల్లా వారి సౌజన్యంతో నారాయణనం యూత్ అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో హిమజా డిగ్రీ కాలేజ్ నుంచి పట్టణ పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పురుషోత్తం రాజు, హిమజా కాలేజ్ ఎన్ఎస్ఎస్ అధికారి హేమాద్రి నాయుడు, అధ్యాపకులు సురేష్, మురళి కవిత, నెహ్రూ యువ కేంద్ర వాలంటీర్లు విజయ్ కుమార్, నితీష్ కుమార్ యువత మహిళలు పాల్గొన్నారు.

శ్రీసిటీ చిన్మయ్యలో ఘనంగా స్పోర్ట్స్ డే

ప్రజాశక్తి -వరదయ్యపాలెం: శ్రీసిటీ పారిశ్రామిక వాడలోని చిన్మయ విద్యాలయం వారు శుక్రవారం పాఠశాల ఆవరణలో 7 వ వార్షిక క్రీడా దినోత్సవం (స్పోర్ట్స్ డే)ను ఘనంగా నిర్వహించారు. స్పోర్ట్స్‌డేలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అన్ని తరగతుల వారికి పలు రకాల ఆటపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్మయ విద్యాలయ ప్రిన్సిపాల్ భువనేశ్వరి మాట్లాడుతూ విద్యార్థినీవిద్యార్థులలో మానసిక ఉత్తేజం, శారీరక పటిష్టత, ఆరోగ్య విధానం లో సృజనాత్మకత పెంపొందించడంలో భాగంగా ప్రతి ఏటా స్పోర్ట్స్ డేని ఘనంగా నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. అనంతరం ఆటలపోటీలలో విజేతలకు ప్రిన్సిపాల్ భువనేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న చేతుల మీద బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం లో విద్యార్థినివిద్యార్థుల తల్లి దండ్రులు, పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వివిధ పోటీలు

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: ఖాదీ మహోత్సవం సందర్భంగా బిఎన్ కండ్రిగ మండలంలో విద్యార్థులకు శుక్రవారం వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఎస్ పుష్కల్ సెకండ్ పిహెచ్ఎస్ బిఎన్ కండ్రిగ, ఇంగ్లీషు మీడియం, ప్రథమ బహుమతి పొందారు. ఎం గౌతమ్ నాయక్ ఫస్ట్ క్లాస్, ఏకలవ్య పాఠశాల ఫస్ట్ హిందీ, ఒఎక్స్ జ్యోత్స్న 8వ తరగతి, ఎంపివిపిఎస్, వెస్ట్‌వరయ్యర్ ఫస్ట్ వక్తృత్వ పోటీలు (తెలుగు మీడియం), విశ్వక్ నాయక్ ఏకలవ్య ఆదర్శపాఠశాల వక్తృత్వ పోటీలు (ఇంగ్లీషు మీడియం), బిఎన్ కండ్రిగ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి డి గిరిష్ బహుమతులు పొందారు.

ఏకొల్లు లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

ప్రజాశక్తి -దొరవారిసత్రం : రోగులకు అవసరమైన వైద్య సేవలు అందించేందుకే ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని దొరవారి సత్రం మండలం వైస్ ప్రసిడెంట్ దువ్వూరు గోపాల్ రెడ్డి అభిప్రాయపడ్డారు. శుక్రవారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ముగింపు ఏకొల్లు లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ప్రసిడెంట్ గోపాల్ రెడ్డిని వేణుంబాకమున స్వామి నాయుడు, ఆవుల అనిల్ కుమార్ శాలువా పూలమాలతో సన్మానించారు. ప్రభుత్వ అధికారులు తహశీల్దార్ గోపీనాథ్ రెడ్డి, ఇన్చార్జి ఎంపీడీవో రఘురామయ్య, మెడికల్ ఆఫీసర్స్ చైతన్య, పాళ ని రాజ్, వైసిపి నాయకులు వేణుంబాక మున స్వామి నాయుడు, ఆవుల అనిల్ కుమార్, సచివాలయ కార్యదర్శిరామయ్య, హెల్త్ సూపరువైజర్స్ సంపూర్ణమ్మ, పద్మావతి, మైథిలి, గోపి కిరణ్, ఎం ఎల్ హెచ్ పి, లు, ఏఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేణిగుంట : రాష్ట్రంలోని పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించడమే జగనన్న లక్ష్యం అని విప్పమాను పట్టేడు సర్పంచ్ లక్ష్మీపతి రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని విప్పమానుపట్టేడు గ్రామపంచాయతీ సంజీవరెడ్డి కాలనీలోని మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న సురక్షను సర్పంచ్ లక్ష్మీపతి రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.అనంతరం ఆరోగ్య కార్యకర్తలను సచివాలయ సిబ్బందిని సర్పంచ్ లక్ష్మీపతి రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అరుంధతి దేవి గైనకాలజిస్ట్, డాక్టర్ వి మధుసూదన్ జనరల్ సర్జన్, డాక్టర్ పి తేజస్విని మెడికల్ ఆఫీసర్, డాక్టర్ ఆర్ శ్రీలక్ష్మి మెడికల్ ఆఫీసర్, కంటి వెలుగు ఆపరేటర్ ఎం దాము, జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్ ఆఫీసర్ ఏ బేబీ రాణి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ హైమావతి ,పిహెచ్ఎన్లు, సూపర్వైజర్లు,ఎం ఎల్ హెచ్ పి లు,ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కేంద్రం జోక్యం చేసుకోవాలి : నన్నపనేని



ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి ఆధారాలు చూపకుండా మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును గత 50 రోజులుగా జైల్లో నిర్బంధిస్తూ రాక్షస ఆనందాన్ని పొందుతున్నారని మాజీమంత్రి నన్నపనేని రాజకుమారి తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజకుమారి మాట్లాడుతూ చంద్రబాబు విషయంలో రాష్ట్రప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి అడ్డుకట్టుగా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని చంద్రబాబు బయటికి వచ్చేలా తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్లపై గౌరవ న్యాయస్థానాలు, న్యాయమూర్తులు పునరాలోచించుకోవాలని విజ్ఞప్తి చేశారు. వైసిపి రాష్ట్రంలో దౌర్జన్యాలు, అక్రమాలు, అక్రమ కేసులు, హౌస్ అరెస్టులు ప్రశ్నిస్తే దాడులు తప్ప వైసిపి ప్రభుత్వం ఏమీ అభివృద్ధి చేసిందని ప్రశ్నించారు. రాష్ట్రంలో రాజకీయాలు రోజురోజుకు దిగజారిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

డాక్టర్ రెడ్డీస్ ఈ కామర్స్ వెబ్‌సైట్ ప్రారంభం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ : డాక్టర్ రెడ్డీస్ లేబరేటర్స్ డైరెక్టు టూ కస్టమర్ పేరుతో ఈ కామర్స్ వెబ్‌సైట్‌ను ప్రారంభించిందని డాక్టర్ రెడ్డీస్ బ్రాండెడ్ మార్కెట్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎం.వి.రమణ తెలిపారు. స్థానిక తిరుమల బైపాస్‌రోడ్డులో ఉన్న ప్రైవేటు హోటల్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మధుమేహ రోగులు కోసం తమ అనుబంధం కంపెనీ శ్వాస్ వెల్నెస్ లిమిటెడ్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సిఈఎల్ ఈవిఐడిఏ డబ్ల్యుఈఎల్ ఎల్-ఎన్ఈఎస్ ఎస్.కం పేరుతో డిసి వెబ్‌సైట్‌ను ప్రారంభించిందన్నారు. టైప్ 2 మధుమేహ రోగులకు వన్‌స్టాప్ సొల్యూషన్‌గా ఇది పనిచేస్తుందని వెల్లడించారు. అన్నివిధాల పరీక్షించిన తర్వాతే ఈ వెబ్సైట్లో ఉత్పత్తులను విక్రయించడానికి ఎంపిక చేస్తామన్నారు. వెబ్సైట్లో బుక్ చేసుకున్న వారికి ప్రస్తుతం దేశవ్యాప్తంగా 18వేల పిన్కోడ్ ప్రాంతాల్లో ఉత్పత్తులు డెలివరీ చేస్తున్నట్లు వెల్లడించారు. వెబ్సైట్లు ద్వారా టైప్ టు, ఫ్రీ డయాబెటిక్ రోగులకు భోజనం, పర్సనలైజేడ్ డైటరీ, హెల్త్ ఇన్ఫర్మేషన్ వంటి సేవలు కూడా అందిస్తున్నామని తెలిపారు. వీటిని రోగులు, వారి సహాయకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సిమెంట్ బస్తాలు మాయం చేశారు?

- జగనన్న కాలనీ లబ్ధిదారులకు ఇవ్వకనే ఇచ్చారని నమోదు
- మండల సమావేశంలో అధికారులను నిలదీసిన సర్పంచ్ రవిరెడ్డి

ప్రజాశక్తి -సత్యవేడు: సత్యవేడు మండలం చెన్నేరి జగనన్న కాలనీలో నిర్మిస్తున్న పక్కా గృహాలకు సంబంధించి పలువురు లబ్ధిదారులకు సిమెంటు బస్తాలు ఇవ్వకనే ఇచ్చారని నమోదు చేయడంపై దాసుకుప్పం గ్రామ సర్పంచ్ రవి రెడ్డి అధికారులను నిలదీశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ప్రతిమ అధ్యక్షతన, ఎంపీడీవో చంద్రశేఖర్ పర్యవేక్షణలో మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జడ్పిటిసి విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ సరోజిని హాజరయ్యారు. ఈ సందర్భంగా సభ్యులు పలు సమస్యలు లేవనెత్తారు. చెన్నేరి జగనన్న కాలనీలో దాదాపు 352 మందికి సిమెంటు బస్తాలు ఇవ్వకనే ఇచ్చామని నమోదు చేశారని గ్రామ సర్పంచ్ రవి రెడ్డి ఆరోపించారు. దీనికి సంబంధించి హౌసింగ్ అధికారులను నిలదీశారు. హౌసింగ్ నిర్మాణాలపై పూర్తిగా పర్యవేక్షణ లోపించడంతో ఇలాంటివి చోటు చేసుకుంటున్నాయని ఆయన సభ దృష్టికి తీసుకొచ్చారు. నియోజకవర్గ కేంద్రం సత్యవేడులో ఉండాల్సిన డిఈ కార్యాలయం నాగలాపురంలో కొనసాగడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. దాసుకుప్పం పంచాయతీలో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు శాతం, పౌష్టికాహార పంపిణీ వివరాలు తేడాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించాలని రవి రెడ్డి ఐసిడిఎస్ అధికారులను కోరారు. సత్యవేడు ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలకు వచ్చిందే తడవుగా డెలివరీ కేసులను తిరుపతి, శ్రీకాళహస్తి వైద్యశాలకు వైద్యులు సిఫార్సు చేస్తున్నారని సభ్యులు పలువురు సభ దృష్టికి తెచ్చారు. దీనిపై ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ సురేష్ జోక్యం చేసుకొని అనస్తియా వైద్యులు లేకపోవడం వల్ల కొన్ని డెలివరీ కేసులను పెద్ద ఆసుపత్రులకు సిఫార్సు చేస్తున్నామని సమాధానమిచ్చారు. ఇక్కడ వీలైనంత వరకు డెలివరీ కేసులూ చూస్తున్నా మన్నారు. భూముల రీసర్వే ప్రక్రియ మండలంలో 31 గ్రామాలకు ఏడు గ్రామాల్లో పూర్తయిందని స్థానిక తహశీల్దారు షేక్ జరీన తెలిపారు. సచి వాలయ భవన నిర్మాణాలకు సంబంధించి 42కు 10 మాత్రమే తుది దశకు చేరుకున్నాయని పంచాయతీరాజ్ ఇన్‌చార్జి దేవిప్రసాద్ పేర్కొన్నారు. వీటితో పాటు ఆయా సమస్యలు సంబంధిత శాఖాధికారులు చర్చించి సమాధానాలు ఇచ్చారు. ఎంపీపీ ప్రతిమ మాట్లాడుతూ సభ్యులు లేవనెత్తిన సమస్యలను అధికారులు పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో చెరివి విద్యుత్ శాఖ ఏ ఈ జగదీష్, వెటర్నరీ డాక్టర్ గోవిందరాజు భాస్కర్, దాసు కుప్పం, చిన్న పాండూరు వైద్యులు డాక్టర్ గుణశేఖర్, లావణ్య, ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటరమణ, ఇరిగేషన్ ఏఈ బాబు, ఆర్అండ్‌బి ఏఈ ఇజ్రా యిల్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ భానుప్రకాష్, ఉపాధి ఏపీవో కృష్ణయ్య, ఐసిడిఎస్ అధికారి దేవకుమారి, సత్యవేడు పంచాయతీ సెక్రెటరీ ముని రవికుమార్, హార్టికల్చర్ అధికారి రాధా రాణి, పలువురు ఎంపీటీసీలు గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిపి ప్రతిమ

గోపీనాథ్‌కి టికెట్ ఎవరిచ్చారు?

తప్పుడు ప్రచారం మానుకోవాలి: వైసిపి

ప్రజాశక్తి-నాయుడుపేట: సూళ్లూరుపేట నియోజకవర్గ వైసిపి టికెట్ తనకే ఖాయం అయ్యిందని చెప్పుకుంటూ తప్పుడు ప్రచారం చేస్తున్న డాక్టర్ గోపీనాథ్‌కు టికెట్ ఎవరిచ్చారో తెలపాలని, తప్పుడు ప్రచారాలు చేస్తూ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలను అయోమయానికి గురి చేయడం సరైన పద్ధతి కాదని వైసిపి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ పాలూరు దశరథ రామిరెడ్డి అన్నారు. శుక్రవారం నాయుడుపేట ఆర్ అండ్ బి అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్త లను అయోమయానికి గురిచేస్తూ తానే అభ్యర్థిగా ప్రకటించుకుని ప్రచారం చేసుకుంటున్న నాయుడుపేటకు చెందిన కంటి వైద్య నిపుణులు, రోటరీ క్లబ్ ప్రసిడెంట్ ఎన్ గోపీనాథ్ పై సీఎం జగన్మోహన్ రెడ్డికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. నిన్న మొన్నటి వరకు టిడిపి, పీఆర్పీ పార్టీల టికెట్ల కోసం ప్రయత్నం చేసి, ఏనాడు వైసిపి జెండా మోయని, కనీసం వైసిపి కార్యకర్త కూడా కానీ గోపీనాథ్ నియోజకవర్గ వైసిపి అభ్యర్థిగా తనకు తాను ప్రకటించుకోవడం నియోజకవర్గ ప్రజల్ని వైసీపీ కార్యకర్తలను మోసం చేస్తున్నారని, సంజీవయ్యకు టికెట్ రాదని చెప్పడం సరికాదన్నారు. 2024 ఎన్నికల్లో కిలివేటి సంజీవయ్య వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి గెలిసి మంత్రి అవుతారన్న ఆశాభావం వ్యక్తం చేశారు.


మాట్లాడుతున్న వైసిపి నాయకులు దశరథరామిరెడ్డి

వైసిపికి ద్రోహం చేసే వారు ఎంతటి వారైనా అధిష్టానం చర్యలు తీసుకుంటుంద న్నారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పై దుష్ప్ర చారాలు తగదన్నారు. టిడిపి వారు కోట్ల రూపాయ లు ఇస్తామని ప్రలోభ పెట్టినప్పటికీ నిజాయితీ, నిబద్ధత గల నాయకుడు ఎమ్మెల్యే కిలివేటి సంజీవ య్య నమ్ముకున్న పార్టీకి ద్రోహం చేయకుండా పార్టీలో కొనసాగుతూ రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిసి ప్రజల హృదయాల్లో స్థానం సంపాదిం చుకున్నారని తెలిపారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య రెడ్డి సామాజిక వర్గానికి వ్యతిరేకం అంటూ చేస్తున్న ప్రచారాలు ఆయన ఖండిం చారు. వాస్తవానికి రెడ్డి సామాజిక వర్గంలోనే వర్గాలు ఉన్నాయన్నారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరినీ గుర్తించి పదవులు ఇచ్చారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే సంజీవయ్య గెలుపునకు కృషి చేస్తామన్నారు. నాయుడుపేట 24వ వార్డు కౌన్సిలర్ దారా రవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వై నాట్ 175 నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నా రన్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి పరిపాలన పట్ల ఆకర్షితులైన ప్రజలు వైసిపిని ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గం లోని నాయుడుపేట, సూళ్లూరుపేటలకు చెందిన కొందరు వైసీపీ నాయకులు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పై వ్యక్తిగత కక్షతో ఆయనకు సీటు రాకూడదని దుష్ప్రచా రాలు చేస్తున్నారని ఇది మానుకోవాలని సూచించారు. తిరుపతిలో విజయ సాయిరెడ్డి నిర్వహించిన సమావేశంలో మనస్పర్థలు ఉంటే సర్దుకుని పనిచేసి పార్టీని గెలిపించాలని విజయసాయి రెడ్డి సూచించినట్లు గుర్తు చేశారు. 'తిరుపతి సమావేశంలో కొందరు నాయకులు మూడోసారి ఎమ్మెల్యేగా కెలివేటి సంజీవయ్య అవసరం లేదని విజయసాయిరెడ్డి దృష్టికి తీసుకువచ్చిన నాయకులు అనేక ఏళ్లుగా అనుభవిస్తున్న పార్టీ పదవులను మరొకరికి ఇవ్వగలరా?' అని ప్రశ్నించారు.ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య వద్ద లబ్ధి పొందిన కొందరు నాయకులు వారు చేస్తున్న పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు, చట్ట వ్యతిరేక కార్యక్ర మాలను ఖండిస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో అధిష్టానం సంజీవయ్యను మూడోసారి సూళ్లూరుపేట అభ్యర్థిగా ప్రకటిస్తుందని, గెలిచి మంత్రి పదవి చేపడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. తాము సంజీవయ్య వెంట నడిచి ఆయన గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ యువజన విభాగం పట్టణ అధ్యక్షులు కావేరిపాకం భాను ప్రసాద్,యువజన విభాగం నాయకులు కావేరి పాకం అశోక్ కుమార్,గంధవల్లి సిద్దయ్య, దొంతాల రాజశేఖర్ రెడ్డి,కె చందు,భావన్,షేక్ జిలాని, అనపల్లి లక్ష్మయ్య, కుంపటి శీను పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణంలో వేగం పెంచండి: కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: నగరంలో ప్రజల సౌకర్యార్థం నిర్మిస్తున్న మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణంలో వేగం పెంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం ప్లానింగ్ అధికారులతో కమిషనర్ ఈ సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశంలో తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ సిటి ప్లానర్ శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.